ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

కరీంనగర్ జిల్లా వార్తలు

5

శనివారం 27 జూలై 2024



నామమాత్రంగా కాలుష్య తనిఖీ

- ఇష్టారాజ్యంగా వాహనాలకు పొల్యూషన్ సర్టిఫికెట్స్ జారీ
- జిల్లాలో 6.44 లక్షల వాహనాలు

కరీంనగర్ క్రైం, జూలై 26: జిల్లాలో 6.44 లక్షల వరకు వాహనాలు ఉన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిపోయే వాహనాలు మరో లక్ష వరకు ఉంటాయని అంచనా. ఈ వాహనాల కాలుష్యం తీవ్రస్థాయిలో ఉంటుంది. కాలుష్య నియంత్రణ సంస్థలు, ఇతర అధ్యయన సంస్థలు వాహనాల నుంచి వెలువడే కాలుష్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కాలుష్యాన్ని నియంత్రించాల్సిన రవాణాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

● ఆరు నెలలకోసారి తనిఖీ తప్పనిసరి

మోటార్ వాహనాల చట్టం నిబంధనల ప్రకారం ప్రతి వాహనానికి ప్రతి ఆరు నెలలకు ఒకసారి కాలుష్య తనిఖీ నిర్వహించాలి. ఈ నిబంధనలను పర్యవేక్షించాల్సిన రవాణా శాఖ అధికారులు గాలికి వదిలేస్తున్నారు. వాహనాల కాలుష్యాన్ని పరీక్షించడం కోసం ప్రైవేట్‌గా పొల్యూషన్ వాహనాలకు అనుమతులిచ్చారు. ఈ ప్రైవేట్ పొల్యూషన్ పరీక్షల కేంద్రాల్లో నిబంధనల ప్రకారం పొల్యూషన్ పరీక్షలు జరగడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పొల్యూషన్ టెస్టింగ్ కేంద్రాల్లో డబ్బుల కోసమే వాహనాలను నామమాత్రంగా పరీక్షించి పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) సర్టిఫికెట్లు జారీ



చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాహనాలకు పొల్యూషన్ పరీక్షలు నిర్వహించిన అనంతరం జారీ చేస్తున్న పీయూసీ సర్టిఫికెట్లను రవాణాశాఖ అధికారులు ఏనాడు తనిఖీ చేయడం లేదు. పీయూసీ సర్టిఫికెట్లలో ఉన్న విధంగానే సదరు వాహనం నిర్దేశించిన పొల్యూషన్ పరిధిలోనే ఉన్నదా? లేదా? అనేది అధికారులు విధిగా తనిఖీ చేయాల్సి ఉండగా ఇటువంటి తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. పోలీసులు వాహనాలను తనిఖీ సమయంలో పీయూసీ సర్టిఫికెట్‌ను చూపించడానికే పనికి వస్తోంది.

● నిబంధనలకు విరుద్ధంగా..

పొల్యూషన్ తనిఖీ కేంద్రాలు నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా పీయూసీ సర్టిఫికెట్లను జారీ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో 6.44 లక్షల వాహనాలున్నాయి. వీటిలో 1.58 లక్షల వాహనాలు 15 ఏళ్లు దాటినవి ఉన్నాయి. ఆటోలు, లారీల్లో డీజిల్‌కు బదులుగా కిరోసిన్‌ను ఉపయోగిస్తున్నారు. దీంతో ఆయా వాహనాలు నిర్ధేశించిన దానికంటే అధికాంగా పొగను వదులుతూ వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్నాయి. ఇటువంటి వాహనాలను గుర్తించి సీజ్ చేయాల్సిన రవాణాశాఖ అధికారులు అది తమ పనికాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాలం చెల్లిన వాహనాలు వదిలిని పొగ కారణంగా వాతావరణం కలుషితమై ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నది. కలుషితమైన ప్రాణవాయువును పీల్చిన ప్రాణులు శ్వాసకోశ సంబంధించిన వ్యాధులబారిన పడి తరచుగా అనారోగ్యంకు గురవుతున్నారు. అన్ని రకాల వాహనాలు నిర్ధేశించిన విధంగా పొగలు వదులుతున్నాయా? లేదా? అనేది పరీక్షించటానికి జిల్లాలో కొన్ని పొల్యూషన్ కేంద్రాలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ పొల్యూషన్ కేంద్రాల నిర్వాహకులు నింధనల ప్రకారం వాహనాలను పరీక్షించి అవి వెలువరిస్తున్న కలుషితమైన పొగ ఏ మేరకు ఉందనేది వెల్లడించకుండా ఇష్టారాజ్యంగా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాయి. ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకునే విద్యాసంస్థల బస్సులు, లారీలు, కమర్షియల్ వాహనాలు మాత్రమే పొల్యూషన్ పరీక్షలు చేయించుకుంటున్నాయి. ద్విచక్రవాహనాలు 10 శాతం కూడా పొల్యూషన్ పరీక్షలు చేయించుకోవడం లేదు. ఆర్టీఏ అధికారులు, పోలీసుల తనిఖీల్లో పట్టుకున్న సందర్భంలో నామమాత్ర జరిమానాను చెల్లిస్తూ తప్పించుకుంటున్నారు.

మహిళా హక్కుల సాధనకు ఉద్యమించాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు లక్ష్మి



ఐద్వా రాష్ట్ర స్థాయి శిక్షణతరగతుల్లో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

భగత్‌నగర్, జూలై 26: మహిళా హక్కులసాధనకోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. శుక్రవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించే ఐద్వా రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహిళలను విస్మరించారన్నారు. దేశంలో మహిళలకు రక్షణ లేదని, నిర్భయ, అత్రాస్, మణిపూర్ ఘటనలే ఇందుకు నిదర్శనమన్నారు. దేశానికి బంగారు పతకాలు సాధించిన మహిళా రెజ్లర్లను బీజేపీ ఎంపీ లైంగికంగా వేధించారని, బాధితులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం నిందితుకు అండగా ఉండడం సిగ్గు చేటన్నారు. నిత్యావసర సరుకులు రోజు రోజుకు పెరిగిపోతున్నా యన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీ లను అమలు చేయాలని కోరారు. ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం అభినందనీయమన్నారు. గ్యాస్ సబ్సిడీ కొద్ది మందికి మాత్రమే అందుతుందన్నారు. గృహజ్యోతి ద్వారా అర్హులైన వారందరికి ఉచిత కరెంటు ఇవ్వాలని, పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్ అరుణజ్యోతి జెండాను అవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కెఎన్ ఆశాలత, మాచర్ల భారతి, నాగలక్ష్మి, శశికళ, అనుమల మహేశ్వరి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షురాలు ద్యావ అన్నపూర్ణ, రోజారాణి, దేవేంద్ర పాల్గొన్నారు.

నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి వరద నీరు

- ఎడమ కాలువ రైతుల ఆనందం



రిజర్వాయర్‌లోకి చేరుతున్న వరద నీరు

గంగాధర, జూలై 26: గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ లోకి వరద నీరు చేరుతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగు వన ఉన్న కొడిమ్యాల మండలం వాగు నుంచి వరద నీరు వస్తోంది. రెండు రోజుల నుంచి వరద నీరు వస్తుండడంతో సగం నిండింది. క్రమక్రమంగా నీటి మట్టం పెరుగుతోంది.

● ఎడమ కాలువకు నీరు

రిజర్వాయర్‌లోకి వరద నీరు చేరి సగం నిండడంతో ఎడమ కాలువకు కొద్దిగా నీరు వస్తోంది. ఉపకాలువకు కూడా నీరు వస్తుండడంతో వానకాలం సాగుపై ఆశలు చిగురించాయి. రిజర్వాయర్‌లోకి నీరు చేరడంతో బావుల్లో నీటి మట్టం పెరుగుతోంది. ఇప్పటికే మండలంలో 60 శాతం వరినాట్లు పూర్తికాగా ఇప్పటి వరకు కురిసిన వర్షాలపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్‌లో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారు

గణేశ్‌నగర్, జూలై 26: బడ్జెట్లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అసంపల్లి వినయ్ సాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగం పైన ఎందుకు ఇంత వివక్ష అని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధి చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో నిరాశ మిగిల్చిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసుతులు లేక, స్కాలర్‌షిప్స్ రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులను కేటాయించి బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు ఇషాక్, బోగేశ్, సురేష్, సుస్మిత పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

● విద్యారంగానికి నిధులు పెంచాలి

భగత్‌నగర్: రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి నిధులు పెంచాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్‌చేశారు. శుక్రవారం నగరంలోని కమాన్ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో విద్యారంగం అభివృద్ధి పాలకులకు పట్టదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రజాపాలనలో విద్యారంగం అభివృద్ధికి అదిక నిధులు కేటాయించక పోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిపెస్టోలో పెట్టినట్లు విద్యారంగానికి 15 శాతంనిదులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మచ్చ రమేష్, జేరిపోతుల జనార్దన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రేణికుంట్ల ప్రీతం, అక్రమ్ మాలిక్, రామారపు వెంకటేష్, సంగెం మధు, నాయకులు మామిడిపల్లి హేమంత్, రామగల్ల నరేష్, కనకం సాగర్, కేశబోయిన రాము, అలువాల విష్ణు, సందీప్‌రెడ్డి, శ్రవణ్, సచిన్ వినయ్‌రెడ్డి పాల్గొన్నారు.



కమాన్ చౌరస్తాలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

రోడ్డుపై నాటువేసి నిరసన



చొప్పదండిలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

చొప్పదండి, జూలై 26: పట్టణంలో ప్రధాన రహదారి బురదమయంగా మారిందని, ప్రజలు ఇబ్బందిపడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని బీజేపీ నాయకులు శుక్రవారం రోడ్డుపై నాటు వేసి నిరసన తెలిపారు. ఇప్పటికైనా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్, నాయకులు చిల్ల శ్రావణ్, గుండేటి శివశంకర్, మంద శ్రీరాం, జిట్టా కుమార్, అనుకారి సాయికృష్ణ, వడ్లూరి సుదాకర్, చల్ల అనూష్, గంగారాం, రాజశేఖర్, వికాస్, కోటేష్, రాజు, కళ్యాన్, పవన్, సంపత్, మహేశ్, శ్రావణ్ పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

కలెక్టర్ పమేలా సత్పతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

రామడుగు, జూలై 26: మహిళలు ఆరో గ్యంగా ఉంటేనే ఇల్లు బాగుంటుందని, మహి ళలు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం మండ లంలోని వెదిర ప్రభుత్వ పాఠశాలలో మహి ళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ సమస్యల పరిష్కారానికి ప్రతి శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో సభ నిర్వహిస్తున్నామని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏ సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకరావాలని సూచించారు. గర్భి ణీలు, మహిళలు ఆరోగ్య సమస్యలతోపాటు ఇతర సమస్య లపై చర్చించే అవకాశం ఉందన్నారు. ప్రతి మంగళవారం ఆరోగ్య కేంద్రాల్లో మహిళలందరికి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్డీవో శ్రీధర్, బీసీడీవో అనిల్ ప్రకాష్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఎంహెచ్‌వో సుజాత, తహసీల్దార్ భాస్కర్ పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- సీపీ అభిషేక్ మొహంతి



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ

తిమ్మాపూర్, జూలై 26: విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యే నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని సీపీ అభిషేక్ మొహంతి పోలీసులను ఆదేశించారు. శుక్రవారం తిమ్మాపూర్ సర్కిల్ కార్యాల యాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సదర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతన చట్టాల అమలు జరిగేలా చూడాలని సూచించారు. సైబర్ నేరాలపై సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలోని అధికారుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్ వారెంట్లు అమలు చేయాలని తెలిపారు. తిమ్మాపూర్ సర్కిల్ పరిధిలో రాష్ట్ర రాహదాని విస్తరించి ఉన్నందున తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ హోల్స్‌గా గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించార కార్యక్రమంలో తిమ్మాపూర్ సీఐ కర్రె స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం

సుభాష్‌నగర్, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను విస్మరించిందని బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కట్ట రాజు విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని కోరుతూ కలెక్టరేటర్ ఎదుట బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రభుత్వం ఏర్పడ్డ మూడు నెలల్లో అమలు చేస్తామని చెప్పి మరిచిపోయారన్నారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా అమలు చేయక పోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మొగిళి శ్రీనివాస్, సార్ల అనిల్, బిజిలి సారయ్య, లోకిన కుమారస్వామి, రాబోతు శ్రీనివాస్‌నాయక్, నాయకులు రవినాయక్, అజయ్, అబి, నిఖిల్ పాల్గొన్నారు.

గుంతలమయంగా బైపాస్

- శివాజీ జంక్షన్ వద్ద ప్రమాదకరంగా మారిన రోడ్డు
- అవస్థలు పడుతున్న వాహనదారులు



కరీంనగర్-సిరిసిల్ల బైపాస్ రోడ్ శివాజీ జంక్షన్ వద్ద ఏర్పడ్డ భారీ గుంత

కరీంనగర్ టౌన్, జూలై 26: గత వారంరోజులుగా కురుస్తున్న ముసురు వర్షానికి నగరంలోని బైపాస్ రోడ్డు గుంతలమయంగా మారింది. కరీంనగర్-సిరిసిల్ల బైపాస్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో తారు రోడ్డు దెబ్బతిన్నది. పద్మనగర్ శివాజీ జంక్షన్‌లో ఏర్పడ్డ భారీ గుంతలతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. గతంలో ఇదే జంక్షన్‌లో జరిగిన ప్రమాదంలో ఒక ఉపాధ్యాయురాలు మృతి చెందారు. ఈ ప్రాంతంలో పలు ప్రమాదాలు జరిగాయి. ఈ జంక్షన్‌లో రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టినా త్వరాగానే దెబ్బతింటుంది. బైపాస్ మీదుగా హైదరాబాద్, వరంగల్ వైపు భారీ వాహనాల్లో గ్రానైట్, ఇసుక, మట్టిని తరలిస్తారు. ఈ రోడ్డుకు శాశ్వతంగా మరమ్మతులు చేయకపోవడంతో కొద్దిపాటి వర్షాలకే జంక్షన్‌లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. పెద్ద గుంతల్లో పడి పలువురు ద్విచక్రవాహనదారులు గాయాలపాలవుతున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడకుండా పటిష్టంగా రోడ్డు వేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. జంక్షన్ సుందరీకరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కళ్యాణ్‌నగర్, జూలై 26: గోదావరిఖని పట్టణంలో అనుమతి లేకుండా ఆసుపత్రులను నడుపుతున్న నకిలీ వైద్యులపై తెలంగాణ వైద్య మండలి కొరడా ఝుళిపించింది. శుక్ర వారం తెలంగాణ వైద్య మండలి సభ్యుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాస క్లీనిక్, శివ పైల్స్ క్లీనిక్ పేరిట చికిత్స చేస్తున్న ఆసుపత్రులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ గోదావరిఖనిలో ఎలాంటి అనుమతులు లేకుండా కొంత మంది క్లీనిక్‌లు ఏర్పాటు చేసి అల్లోపతి, ఆయుర్వేదం, పైల్స్ ఆసుపత్రులు నెలకొల్పారని, అందులోనే ల్యాబ్‌లను, మెడికల్ షాపులను ఏర్పాటు చేసి విచ్చలవిడిగా యాంటీ బయోటిక్స్, స్టెరైడ్స్ ఇస్తున్నట్టు గుర్తించామని, వారిపై ఎన్ఎంసీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయనున్నట్టు చెప్పారు. అర్హత లేని వ్యక్తులు ప్రైవేట్‌గా క్లీనిక్‌లు పెట్టి ప్రాక్టీస్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని, పేరుకు ముందు డాక్టర్‌గా పెట్టుకోవద్దని, ఎవరైనా అనుమతి లేకుండా ప్రాక్టీస్ నిర్వహిస్తే వారికి చట్ట ప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో హెచ్ఆర్‌డీఏ సెక్రెటరీ గౌతం, బృందం పాల్గొన్నది.

గోదావరిఖనిలో నకిలీ వైద్యులపై కొరడా

- ఆసుపత్రులను సీజ్ చేసిన తెలంగాణ వైద్య మండలి
- పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకుంటే చర్యలు: వైద్యాధికారి రాజ్‌కుమార్

క్లీనిక్‌లు మూసి వేసిన ఆర్‌పీఎంలు, పీఎంపీలు

గోదావరిఖనిలో శుక్రవారం పలు ఆసుపత్రులపై అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారనే సమాచారం తెలుసుకున్న కొంతమంది ఆర్‌పీఎంలు, పీఎంపీలు క్లీనిక్‌లను, వాటికి అనుబంధంగా ఉన్న ల్యాబ్‌లను, మెడికల్ షాపులను మూసివేసి పరుగులు తీశారు. ఈ బృందం ఎక్కడెక్కడ తనిఖీ చేస్తుందో సమాచారం తెలుసుకుని వారిని అనుసరించారు. అధికారుల బృందం కొన్ని ఆసుపత్రులకు వెళ్లే సరికి మూసివేసి ఉన్నాయి.


ఆర్ఎంపీ క్లీనిక్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారి రాజ్‌కుమార్

కేంద్ర బడ్జెట్‌తో నిరాశ.. రాష్ట్ర బడ్జెట్‌తో ఊరట



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

భగత్‌నగర్, జూలై 26: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ ప్రజలకు నిరాశ మిగిల్చినా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ఊరట లభించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. శుక్ర వారం సీపీఐ రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు పరచడం కోసం వివిద శాఖలకు కేటాయించిన నిధులను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న నాయకుడు బడ్జెట్ సమావేశాల్లో పూర్తి స్థాయిలో పాల్గొనకుండా బడ్జెట్ అంశాలను విని సూచనలు, సలహాలు ఇవ్వాల్సింది పోయి ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతా అనే అభిప్రాయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సంక్షేమం, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై తన అనుభవాన్ని ఉపయోగించి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. అధికారం కోల్పోయామని తిరిగి అధికారం కోసమే విమర్శలు చేయడం సరికాదన్నారు. కేసీఆర్ నియంతృత్వ పోకడలు, నియంతలాగా వ్యవహరించడంతోనే ప్రజలు ఓడించారన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి అనేక సంక్షేమ పథకాల కోసం నిధులు కేటాయించారని, వాటిని అమలు చేయాలన్నారు. అర్హులైన వారికి ఇండ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. మిగులు భూములను పేదలకు పంపిణీ చేయాలన్నారు. రేషన్ కార్డులపై ఇప్పటి వరకు ప్రభుత్వానికి ఎలాంటి కార్యాచరణ లేదన్నారు. ధరణి పోర్టల్‌లో అనేక మంది రైతుల భూములకు సంబంధించిన సమస్య లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. భూమాతతో రైతుల సమస్యల పరిష్కారి స్తామని చెప్పిన ప్రభుత్వం భూ సర్వే నిర్వహించి సాగు చేసుకుంటున్న అసలైన పట్టాదారులకు పట్టాదారు పాసు బుక్కులు అందించాలన్నారు. సిరిసిల్ల చేనేత వస్త్ర పరిశ్రమ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి చేనేత కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిద్దిపేట, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల సీపీఐ కార్యదర్శులు మంద పవన్, తాండ్ర సదానందం, వెన్న సురేష్, సీపీఐ కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో రాజ్యాధికార సంకల్ప దివస్


మాట్లాడుతున్న నిషాని రాంచంద్రం

సుభాష్‌నగర్, జూలై 26: బహుజన సమాజ్‌పార్టీ(బీఎస్పీ) ఆధ్వర్యంలో రాజ్యాధికార సంకల్ప దివస్ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రాంచంద్రం మాట్లాడుతూ చత్రపతి సాహూమహరాజ్ నిమ్న కులాలకు 50 శాతం రిజర్వేషన్లను అమలు చేశారని తెలిపారు. 1902 జూలై 26న వెనకబడిన కులాలు, అంటరాని కులాలకు, మహిళలకు విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టారని అన్నారు. సాహూ మహరాజ్ బ్రిటీష్ ఇండియాలోని కొలహాపూర్ సంస్థానానికి రాజు అని తెలిపారు. వెనకబడిన, నిమ్నవర్గాల పిల్లలకు నిర్బంధ విద్యను ప్రవేశపెట్టారని, విద్య దూరం అయిన కులాలకు ప్రత్యేక పాఠశాలలు స్థాపించాడని, మహాత్మా జ్యోతిబాపూలే స్థాపించిన పాఠశాలలకు ఆయన నిధులు కేటాయించి నిమ్న కులాలకు విద్యావ్యాప్తి కోసం కృషి చేశారని తెలిపారు. ఆయన ఆశయాలను, లక్ష్యాలను స్ఫూర్తిగా తీసుకొని అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దడ్డే శ్రీనివాస్, దొడ్డె సమ్మయ్య మాతంగి అశోక్, మంద బాలయ్య, కల్లెపెల్లి రాజేందర్, మాంకాలి తిరుపతి, పల్లె ప్రశాంత్‌గౌడ్, మారపెల్లి మొగిలయ్య పాల్గొన్నారు. బీఎస్పీలో ఎలగందల్‌కు చెందిన బోనాల సంతోష్, కిన్నెర రజనీకాంత్ చేరారు. జిల్లా అధ్యక్షుడు దొడ్డె శ్రీనివాస్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

గంజాయి కేసులో పలువురి అరెస్టు

ఎల్లారెడ్డిపేట, జూలై 26: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను శుక్రవారం రిమాండ్‌కు తరలించామని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని చింతకింది భానుచందర్, గోనె ఉదయ్ రాపల్లి వాగు వంతెన వద్ద గంజాయి అమ్ముతున్నారనే సమాచారంతో ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకొని విచారించారు. కరీంనగర్‌లోని గుర్తుతెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు తేలింది.

ఇల్లంతకుంట: మండలకేంద్రానికి చెందిన మహమ్మద్ జమీర్ గంజాయి కేసులో అరెస్టు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఆటో నడుపుకునే జమీర్ సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలానికి చెందిన గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేస్తున్నాడు. ఇల్లంతకుంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం నిందితుడిని అదుపులోకి తీసుకొని గంజాయి కిట్ ద్వారా పరీక్షించగా పాజిటీవ్‌గా తెలింది. జమీర్ వద్ద నుంచి 100 గ్రా. గంజాయి, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు.

సిరిసిల్ల క్రైం: రెండు గంజాయి కేసుల్లో నలుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌కు చెందిన వీరబోయిన అజయ్, సిరిసిల్ల మండలం చిన్న బోనాలకు చెందిన అవునూరి ప్రశాంత్, పండుగ మహేశ్, సందవేణి మహేశ్ ఉన్నట్లు పేర్కొన్నారు. 150 గ్రాముల గంజాయి, 5 గంజాయి సిగరెట్లు, రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు.

కుక్కల దాడిలో వృద్ధుడికి గాయాలు



వృద్ధుడి చేతులపై కుక్కగాట్లు

గంభీరావుపేట, జూలై 26: గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి సమీపంలో వృద్ధుడిపై వీధి కుక్కలు విచక్షణ రహితంగా దాడి చేశాయి. లింగన్నపేటకు చెందిన లక్ష్మణ్ పని నిమిత్తం మండల కేంద్రానికి వచ్చాడు. రోడ్డుపై వెళ్తున్న లక్ష్మణ్‌ను వెంటపడి మరీ దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. వెంటనే కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, నాయకులు గౌరీ శంకర్ అక్కడికి చేరుకుని ప్రథమ చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. లక్ష్మణ్‌కు తన వంతు సాయంగా హమీద్ వెయ్యి రూపాయలు అందజేశారు.

16.109 టీఎంసీలకు చేరుకున్న శ్రీపాద ఎల్లంపల్లి

- మోటర్లు ఆన్ చేసి మిడ్ మానేరుకు నీటిని తరలించేందుకు రంగం సిద్ధం
- నీటిపారుదల శాఖ అధికారుల సమావేశంలో ప్రభుత్వ నిర్ణయం



ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు రెండుమూడు రోజుల్లో పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోనున్నది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల వల్ల సుమారు 23 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ఆదివారం కల్లా ప్రాజెక్టులోకి పూర్తిస్థాయిలో నీళ్లు రానున్నాయి. అయితే ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోకముందే ప్రాజెక్టులు గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదిలిపెట్టడం పరిపాటి. అయితే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గల మిడ్ మానేరు, లోయర్ మానే డ్యామ్‌లకు వరద నీరు పెద్దగా రాకపోవడంతో ఆ ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తకుండా ఒకటి, రెండు రోజుల్లో కాళేశ్వరం ప్రాజెక్టు నంది మేడారం నంది పంప్‌హౌస్, కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లో గల గాయత్రి పంప్‌హౌస్ మోటార్లను ఆన్ చేసి మిడ్ మానేరు నీటిని తరలించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో గోదావరి పరివాహక ప్రాంత నీటిపారుదలశాఖ అధికారులతో ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తక్షణమే ఎల్లంపల్లి ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోస్తేనే కొంత మేలు జరుగుతుందని భావిస్తున్నారు. జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకు 23,701 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. దీంతో ప్రాజెక్టు 16.109 టీఎంసీల నీటిమట్టానికి చేరుకున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం వస్తున్న వరద నీరు ఇలాగే కొనసాగితే శనివారం సాయంత్రం కల్లా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టనికి చేరుకోనున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి మట్టానికి చేరుకోక ముందే నీటిని ఎత్తిపోయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఎగువప్రాంతంలో వర్షాలు కురవకపోవడంతో..

రాజన్నసిరిసిల్ల జిల్లాలో గల శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ మిడ్ మానేరు పూర్తిస్థాయి నీటిమట్టం 27 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ఆరు టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. కరీంనగర్ శివార్లో గల లోయర్ మానేర్ డ్యాం పూర్తి నీటిమట్టం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ఆరు టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. ఈ రెండు రిజర్వాయర్ల ఎగువ ప్రాంతంలో వర్షాలు అంతగా కురవకపోవడంతో వరద నీరు తక్కువగా వస్తున్నది.

ఈ నేపథ్యంలో శ్రీపాద ఎల్లంపల్లి నుంచి నీటిని తరలిస్తే ఉపయోగంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తున్నది. మిడ్ మానేరుకు తరలించిన నీటిని, అవసరమైతే ఎల్ఎల్ఎండీకి, లేదంటే మల్లన్న సాగర్‌కు కూడా తరలించుకునే అవకాశాలు ఉన్నాయి. వర్షాల వల్ల వచ్చిన నీటిని వచ్చినట్లే మోటార్ల ద్వారా ఎత్తిపోస్తే వానా కాలం సీజన్, వచ్చే యాసంగి సీజన్‌కు సాగునీటికి డోకా లేకుండా చూడాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకటి, రెండు రోజుల్లో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వస్తున్న అదనపు వరద నీటిని గేట్లు ద్వారా గోదావరిలోకి వదిలి పెట్టకుండా, నంది పంప్ హౌస్, గాయత్రి పంప్ హౌస్‌లను ఆన్ చేసి నీటిని మానేరులోకి ఎత్తిపోయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

ఎస్సారెస్పీకి పెరిగిన వరద

ప్రాజెక్టులోకి 25,150 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. శుక్రవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 25,150 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 28.389 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 59. 766 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతర ములకు కలిపి ప్రాజెక్టు నుంచి 564 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 22.360 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.302 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

మల్యాల, జూలై 26: మండలంలోని రాజారం ప్రభుత్వ పాఠశాలలో గురువారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. పాఠశాల ఆఫీస్ గది తాళాలు పగులగొట్టి అందులోని కంప్యూటర్‌తో పాటు సంబంధిత పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఇటీవలే మన ఊరు-మన పాఠశాల కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్యాన్లను కూడా ఎత్తుకెళ్లడానికి ప్రయత్నం చేసి, గదిలోని వస్తువులను అస్తవ్యస్తంగా పడేశారు. సంఘటన స్థలాన్ని బట్టి తెలుస్తుందని తెలిపారు. కాగ దొంగతనం జరిగిన ప్రాంతాన్ని సీఐ నీలం రవి, ఎస్సై నరేష్‌కుమార్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో పరిసర ప్రాంతాలను గాలించారు.

అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వాలి

గ్రామాల్లో అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్సై ఏ.నరేష్‌కుమార్ మండల ప్రజలను కోరారు. ఇటీవల పాఠశాలలు, మండలంలో దొంగతనాలు చోటు చేసుకున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ ఇళ్లకు తాళం వేసి వెళితే బంగారు ఆభరణలు, నగదు వెంట తీసుకెళ్లాలని సూచించారు.

పారిశుధ్య కార్మికురాలిపై దాడి

ఎల్లారెడ్డిపేట, జూలై 26: పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని పారిశుధ్య కార్మికురాలు ర్యాకం నర్సవ్వపై యువకుడు బత్తుల రాజు దాడి చేసిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని నర్సవ్వ పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తోంది. ఇంటి పక్కన ఉన్న బత్తుల రాజుతో కొంత కాలంగా స్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇంట్లో ఒంటరిగా ఉన్న నర్సవ్వపై రాజు దాడి చేయడంతో ఆమె తీవ్ర గాయపడింది. స్థానికులు గమనించి అడ్డుకున్నారు. తీవ్ర గాయాలైన నర్సవ్వను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బేగంపేట్‌లో వ్యక్తిపై..

రామగిరి: మండలంలోని బేగంపేట్ గ్రామంలో గురువారం రాత్రి వాట్సాప్ మేసెజ్‌తో వచ్చిన వివాదం చివరికి ఓ వ్యక్తిపై దాడికి దారి తీసింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన సాయి అనే వ్యక్తి గ్రామానికి సంబంధించిన గ్రూప్‌లో అభ్యంతరకరంగా ఉన్న వ్యాఖ్యలతో కూడిన అంశాన్ని వాట్సాప్‌లో పోస్టు చేశాడు. వాట్సాప్ మెసెజ్ విషయంపై అడిగిన దాసరి శ్రీనివాసును సాయితో పాటు సురేందర్, దశరథం అనే మరో ఇద్దరు వ్యక్తులు నీకు ఎందుకు అంటూ దుర్భాషలాడుతూ బీర్ సీసాను పగలగొట్టి శ్రీనివాస్‌పై దాడికి పాల్పడినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ముత్తారం, జూలై 26: మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన మాకోటి లక్ష్మయ్య (55) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మధుసూధన్ రావు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు సంవత్సరాల నుంచి కిడ్నీ సమస్యతో బాధపడుతూ కరీంనగర్‌లో చికిత్స పొందుతూ ఉండేవాడని ఈ మధ్యకాలంలో కిడ్నీ నోప్పి తీవ్రత ఎక్కువగా కావడంతో శుక్రవారం పత్తి చేను వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన పక్కన ఉన్న రైతులు కుటుంబ సభ్యుల సహకారంతో వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముత్తారం ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

రామగిరి, జూలై 26: మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన కాసాని వినోద్(32) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. వినోద్‌కు కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డుప్రమాదంలో కాలు విరిగిపోగా ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. విరిగిన కాలుతో మేస్త్రీ పనులు చేయలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. మానసికంగా కలత చెందిన వినోద్ శుక్రవారం తెల్లవారు జామున తాడుతో దూలనికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య కాసాని అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేసీఆర్ పాలనలో నిండుకుండలా గోదావరి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



గోదావరినదిని పరిశీలిస్తున్న కేటీఆర్

గోదావరిఖని, జూలై 26: కేసీఆర్ పాలనలో గోదావరినది నిండుకుండాలా ఉండేదని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఎండిన గోదావరి దర్శనమిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. చలో మేడిగడ్డ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందంతో పర్యటనకు వచ్చిన కేటీఆర్ శుక్రవారం ఉదయం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సమీపంలోని గోదావరి వంతెనపై ఆగి గోదావరినదిని పరిశీలించారు. ఎండిన గోదావరినదిని చూసి కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కన్నేపల్లి పంప్‌హౌస్ నడిపి నీటిని ఎత్తిపోస్తే గోదావరినది నిండుకుండలా ఉంటుందని కేటీఆర్ అన్నారు. పర్యటనలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు.

ఇండియన్ బ్యాంకు ఎదుట రైతుల ఆందోళన



బ్యాంకు ఎదుట మేనేజర్‌తో మాట్లాడుతున్న రైతులు

శంకరపట్నం, జూలై 26: తమకు లక్ష రూపాయల లోపు రుణమాఫీ కాలేదని మండలంలోని మొలంగూర్ ఇండియన్ బ్యాంకు ఎదుట శుక్రవారం రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఇతర బ్యాంకుల్లో రైతులకు లక్ష రూపాయల లోపు రుణమాఫీ అయ్యిందని, ఇండియన్ బ్యాంకులో ఎందుకు కాలేదని రైతులు బ్యాంకు మేనేజర్‌ను నిలదీశారు. రుణమాఫీ జాబితా పంపించారా అని మేనేజర్‌ను ప్రశ్నించారు. జాబితా పంపిస్తే తమకు చూపించాలని మేనేజర్‌తో వాగ్వాదానికి దిగారు. ఆయన సరైన సమాధానం ఇవ్వకపోవడంతో మండల వ్యవసాయాధికారిని ఫోన్ ద్వారా సంప్ర దించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఆయన చెప్పడంతో ఆందోళన విరమించారు.

ఒకరి రిమాండ్

ముస్తాబాద్, జూలై 26 : వరకట్న వేధింపుల కేసులో మండలంలోని వెంకట్రావుపల్లెకు చెందిన ఆంజనేయులును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఆంజనేయులు తన భార్య ఎనగంటి రేఖను వరకట్నం కోసం వేధించడంతో ఆత్మహత్య చేసుకుందని ఆమె తల్లి శాంతమ్మ ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థి మృతి

సిబ్బంది నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

మెట్‌పల్లి రూరల్, జూలై 26: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ క్యాంపులోని గురుకుల పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న రాజారపు గణాధిత్య(13) ఫిట్స్‌తో శుక్రవారం మృతి చెందాడు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే విద్యార్థి మృతికి కారణమని బంధువులు ఆరోపిస్తున్నారు. మెట్‌పల్లి అనుసంధానమైన ఆరపేట గ్రామానికి చెందిన రాజారపు మహేష్, లావణ్యలకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు పుట్టిన రెండు నెలలకు, చిన్న కుమారుడు ఆరేళ్ల కింద ఫిట్స్‌తో మృతి చెందారు. రెండో సంతానం అయిన గణాధిత్యను మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ బాలుర గురుకుల పాఠశాలలో ఇటీవలే చేర్పించారు. శుక్రవారం ఉదయం పాఠశాల యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేసి గణాధిత్యకు ఫిట్స్ వచ్చింది ఆస్పత్రికి తీసుకెళ్లాలంటూ సమాచారం అందించారు. విద్యార్థి తండ్రి వెంటనే పాఠశా లకు చేరుకుని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.



గణాధిత్య(ఫైల్)

పాఠశాల ప్రిన్సిపల్ నిర్లక్ష్యం వల్లే విద్యార్థి మృతి చెందాడని తల్లిదండ్రులతో పాటు బంధువులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ప్రిన్సిపల్ విద్యసాగర్‌ను వివరణ కోరగా విద్యార్థులు అంతా కలిసి వార్డులో నిద్రిస్తున్నారని, అంతలోనే గణాధిత్యకు ఫిట్స్ వచ్చినట్లు తోటి విద్యార్థులు సిబ్బంది దృష్టికి తేవడంతో విద్యార్థి తల్లిదండ్రులకు వెంటనే సమాచారం అందించినట్లు వివరణ ఇచ్చారు.



విద్యార్థి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

భయంతో ఇంటి దారి పట్టిన విద్యార్థులు

మండలంలోని పెద్దాపూర్ క్యాంపు గురుకుల పాఠశాలలోని విద్యార్థులు భయంతో ఇంటి దారి పట్టారు. పాఠశాలలో శుక్రవారం వేకువ జామున విద్యార్థి గణాధిత్య ఫిట్స్‌తో మృతి చెందడంతో తోటి విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు.

బావిలో పడి వృద్ధుడి మృతి



బొందయ్య మృతదేహం

చిగురుమామిడి, జూలై 26: మండలంలోని రేకొండకు చెందిన మొగిళి బొందయ్య (70) ప్రమాదవ శాత్తు వ్యవసాయ బావిలో పడి శుక్రవారం మృతి చెందాడు. బొందయ్య గొర్రెలను మేపడానికి వెళ్లాడు. శుక్రవారం సాయంత్రం గొర్రెలను ఇంటికి తోలు కొస్తున్నక్రమంలో ఓ గొర్రె పిల్ల సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో పడింది. దానిని రక్షించడానకి బొందయ్య తాడు సహాయంతో బావిలోకి దిగాడు. గొర్రె పిల్లను బావిలోంచి బయటకు తీశాడు. బావి నుంచి బయటకు వస్తున్న క్రమంలో తాడు తెగిపోయి బావిలో పడి నీట మునిగి మృతి చెందాడు. బొందయ్య కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బండి రాజేశ్ తెలిపారు.

ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 26: ఎల్లారెడ్డిపేట పరిధిలోని కిష్టంపల్లి శివారులో శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి మండలంలోని రాచర్ల గొల్లపల్లికి చెందిన మార్వాడి రాములకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రాములు తన ద్విచక్ర వాహనంపై వెళుతున్న క్రమంలో అదుపుతప్పి కిందపడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎస్సారెస్పీ నిర్మాణం ప్రారంభించి 61 ఏళ్లు పూర్తి

జగిత్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ వరద ప్రదాయినిగా పేరొందిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి శంఖుస్థాపన జరిపి నేటికి 61 ఏళ్లు పూర్తవుతోంది. 1963 జూలై 26వ తేదీన అప్పటి ప్రధాన మంత్రి పండిత్ జవహర్ లాల్ నెహ్రూ పోచంపాడ్ వద్ద పునాది రాయి వేసిన రోజును పలువురు రైతులు, అధికారులు నెమరువేసు కుంటున్నారు. నీటి పారుదల జలాశయాలు ఆధునిక దేవాలయాలుగా ప్రధాని నెహ్రూ అభివర్ణించారని గుర్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా పోచంపాడ్ ప్రాజెక్టు వద్ద పండిత్ నెహ్రూ విగ్రహానికి శుక్రవారం పలువురు ఎస్సారెస్పీ అధికారులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా డ్యామ్ వద్ద గల నీటి ప్రవా హంలో గోదావరి తల్లికి పూలు సమర్పించారు. ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్ రావు, ఈఈ చక్రపాణి, డీఎస్ఈ లాల్ సింగ్, డీఈఈలు గణేష్, సుకుమార్, రఘుపతి, డ్యామ్ ఏఈఈ వంశీ పాల్గొన్నారు.



నెహ్రూ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు

ఎన్టీపీసీలో ముగిసిన కేవీ రీజినల్ స్పోర్ట్స్

జ్యోతినగర్, జులై 26: రామగుండం ఎన్టీపీసీలో రెండు రోజులుగా జరుగుతున్న కేంద్రియ విద్యాలయాల(కేవీ) రీజినల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఎన్టీపీసీ జ్యోతిక, స్పందన ఇండోర్ స్టేడియంల్లో జరిగిన పోటీల్లో హైదరాబాద్ రీజియన్‌లోని కేంద్రియ విద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అండర్ 17 విభాగంలో ఎస్.శ్రీజ (పికెట్ కేంద్రియ విద్యాలయం) ప్రథమ, దండు తేజశ్విని (నల్గొండ కేవీ) ద్వితీయ, ఏంజెల్ (గచ్చిబౌలి కేవీ) తృతీయ స్థానంలో నిలిచారు. అండర్ 19 విభాగంలో కె జాహ్నవి (కాకినాడ కేవీ) మొదటి స్థానం, ఎస్ సహర్ష(పికెట్) రెండో స్థానంలో నిలిచారు. పతకాలు సాధించిన విద్యార్థులు హైదరాబాద్ రీజియన్ జట్టుకు ఎంపికయ్యారని, త్వరలో జరగబోయే కేంద్రియ విద్యాలయాల సంఘటన్ ఆధ్వర్యం లో జరిగే జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలో పాల్గొం టారని ఎన్టీపీసీ కేంద్రియ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శోభన్‌బాబు తెలిపారు. క్రీడా పోటీలను విజయవంతం చేయడంలో సహకరించిన ఎన్టీపీసీ యాజమాన్యానికి, ఇతర సిబ్బంది, కోచ్, ఉపాధ్యాయులకు శోభన్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.



పతకాలు అందుకున్న అండర్ 19 విజేతలు

బెంబేలెత్తిస్తున్న చోరీలు

- వరదకాలువకు అమర్చుకున్న ఫ్యూజ్‌లను వదలని దొంగలు
- వరుస చోరీలతో రైతుల ఆందోళన

మల్యాల, జూలై 26: వరదకాలువ నీటి ఆధారంగా సాగు చేసుకునే రైతులు దొంగతనాలతో ఆందోళన చెందుతున్నారు. కాలువలోని నీటిని వినియోగించుకునేందుకు గాను ఏర్పాటు చేసుకున్న పంప్‌మోటార్లలోని కాపర్ తీగలను గత కొన్నేళ్లుగా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తు కెళ్లడంతో బెంబె లేత్తుతున్నారు. ప్రతి ఏటా ఇదే విధంగా వరుసగా కొనసాగుతుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్యాల మండలంలోని రాంపూర్ నుంచి బల్వంతాపూర్ శివారు వరకు గల దాదాపు 14కి.మీల వరద కాలువకు వందలాది రైతులు పంప్‌మోటార్లను అమర్చుకొని సాగు చేసుకుంటున్నారు.

అయితే గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో పంప్‌మోటార్లలోని కాపర్ తీగలను ఎత్తుకెళుతున్నారు. కొన్నేళ్లుగా కాపర్ తీగలతో పాటు విద్యుత్ తీగలు, ఫ్యూజ్‌లు ఎత్తుకెళుతున్నారు. తాజాగా గురువారం అర్ధరాత్రి కూడా నూకపల్లి శివారు నుంచి మల్యాల శివారు వరకు గల విద్యుత్ పంప్‌సెట్ల వద్ద స్టార్టర్ బాక్స్‌లకు అమర్చిన 20 మంది రైతు లకు సంబంధించిన ఫ్యూజ్‌లను ఎత్తుకెళ్లారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడం, పంటల సాగు కొనసాగు తున్న తరుణంలో దొంగలు కాపర్, విద్యుత్ తీగలు, ఫ్యూజ్‌లు ఎత్తుకెళ్లడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఫ్యూజ్‌లు ఎత్తుకెళ్లిన్నట్లు చూపుతున్న రైతులు

గతంలో దొంగలు చిక్కినా..

ఈ ప్రాంతంలో కొన్నాళ్ల క్రితం పంప్‌మోటార్లను పగులగొట్టి కాపర్‌తీగలు, విద్యుత్ తీగల దొంగతనాలకు పాల్పడిన దొంగలు గత రెండేళ్ల క్రితం పట్టుబడగా కేసులు కూడా నమోదు అయ్యాయి. వారి వద్ద తీగలు రికవరీ చేసినా రైతులుకు అందలేదు. అదిఅలా ఉంటే దొంగతనాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ప్రతి ఏటా పంటల సాగు సీజన్‌లలో వరుస దొంగతనాలతో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. విద్యుత్ తీగలలో ఉండే కాపర్ తీగల కోసం నిప్పంటించి కాపర్‌నే వేరు చేసి అమ్ముకుంటారు. గత నెల రోజుల నుంచి మూడు సార్లు నూకపల్లి శివారు నుంచి బల్వాంతపూర్ వరకు పదుల సంఖ్యలో రైతుల విద్యుత్ తీగల చోరీకి గురి అయ్యాయి. దీంతో ఇటీవల రైతులు కాపర్ తీగలకు బదులు అల్యూమినియంతో ఉండే తీగలను ఏర్పా టు చేసుకుంటున్నారు. దొంగల బెడదను అరికట్టడానికి తగు చర్యలు తీసుకోవల్సి ఉంది.

నష్టపోవాల్సి వస్తుంది

రాయలింగం, రైతు, నూకపల్లి

వరదకాలువకు అమర్చుకున్న విద్యుత్‌మోటార్ల కాపర్, విద్యుత్ తీగలను తరచూ ఎత్తుకెళ్లడంతో మళ్లీ కొనుగోలుతో నష్ట పోవాల్సి వస్తుంది. పంటల సాగుకు కూడా ఇబ్బందులు అవుతున్నాయి. కొన్ని సార్లు రాత్రి వేళ్లల్లో కాపాలా కూడా ఉండాల్సి వస్తుంది. దొంగతనాల నివారణకు పోలీసులు తగు చర్యలు తీసుకోవాలి. పర్యవేక్షణ కూడా చేయాలి.

నేడు కరీంనగర్‌కు కేంద్ర మంత్రి రాక

భగత్‌నగర్, జూలై 26: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని చర్లపల్లిలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవంతో పాటు స్థానికంగా పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ఎంపీ కార్యాలయం వర్గాలు తెలిపాయి. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో బోనాల కార్యక్రమంలో పాల్గొని పాతబస్తీలోని పలు ఆలయాలను సందర్శిస్తారని తెలిపారు. తొలుత పాతబస్తీలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుంటారు. అక్కడి నుంచి బేలా, హరిబౌలి, లాలా దర్వాజ, గౌలిపుర, ఉప్పుగూడ, అలియాబాద్, మేకలబండ, దూద్‌బౌలి, హుస్సేని ఆలం, కార్వాన్ ప్రాంతాల్లోని ఆలయాలను సందర్శించడంతో పాటు బోనాల ఉత్సవాల్లో పాల్గొన నున్నారు. అనంతరం పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీకి వెళ్లను న్నట్లు ఎంపీ కార్యాలయవర్గాలు తెలిపాయి.

ఉనికిని చాటుకునేందుకే బీఆర్‌ఎస్ ప్రాజెక్టుల బాట

- కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, జూలై 26: ప్రజల్లోఉనికిని చాటుకునేందుకే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రాజెక్టుల బాట పట్టారని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో జనరంజకమైన బడ్జెట్ ప్రవేశపెట్టడంతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల మైండ్ బ్లాంక్ అయిందన్నారు. వారిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఎల్‌ఎండి రిజర్వాయర్‌ను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సందర్శించి తన్మయత్వం పొందడం ఆనందం కలిగిందని అన్నారు. అట్టర్ ఫ్లాప్ అయిన కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించి లోపాలను పరిశీలించడం వారు చేసిన పాపాలకు ప్రాయచ్చిత్తం చెందడమేనని అన్నారు. 10 ఏళ్ల కాలంలో చేసిన అవినీతిని ప్రజలు మర్చిపోలేరని పేర్కొన్నారు.

ప్రజల ఆకాంక్ష మేరకు బడ్జెట్ రూపకల్పన

- మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్

కరీంనగర్ అర్బన్, జూల 26: రాష్ట్ర బడ్జెట్‌ను ప్రజల అవసరాలు, ఆకాంక్షల మేరకు రూపకల్పన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రివర్యులు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వానికి బడుగు బలహీన వర్గాల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం డీసీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇకనైనా కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు వాస్తవాలు మాట్లాడాలని అన్నారు.

కామధేనువు సూపర్‌బజార్ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి



కామధేనువు సూపర్‌బజార్ కార్యవర్గం

కరీంనగర్ టౌన్, జూలై 26: ది కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర వినిమయదారుల స్టోర్స్ లిమిటెడ్ (కామధేనువు సూపర్‌బజార్) చైర్మన్‌గా ముదుగంటి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం డైరెక్టర్లుగా మిడిదొడ్డి మధుసూధన్‌రావు, కొండం వేణుగోపాల్‌రెడ్డి, సాధవేని మధుసూధన్, మహ్మద్ ఫక్రుద్దీన్, మూల వెంకట రవీందర్‌రెడ్డి, నాయిని నర్సింగారావు, ఆకారపు స్వరూపరాణి, బచ్చు కవిత ఎన్నుకున్నారు. ఎన్నికల పట్ల మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి, బండి ప్రశాంత్‌దీపక్, డీసీసీ నాయకులు మాదాసు శ్రీనివాస్, ఎం.దామోదర్ రావు, దామోదర్ తదితరులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

నగరంలో నేల కూలిన వృక్షం

● ట్రాఫిక్‌కు అంతరాయం ● స్పందించిన మున్సిపల్ సిబ్బంది

కరీంనగర్ టౌన్, జూలై 26: నగరంలో గత రెండురోజులుగా కురుస్తున్న వర్షంతో ఎల్ఐసీ కార్యాలయ సమీపంలో చెట్టు నేలకూలింది. దీనితో రవాణాకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలిసిన వెంటనే మేయర్ సునీల్‌రావు ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది, డీఆర్‌ఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకొని యుద్ధ ప్రాతిపదికన చెట్టును తొలగించి రవాణాకు ఇబ్బంది లేకుండా చూశారు. నగరంలో ఎక్కడైనా సమస్య ఎదురైతే వెంటనే మున్సిపల్ కార్యాలయంలో గానీ, తమకు లేదా కార్పొరేటర్లకు సమాచారమిస్తే వెంటనే సమస్య పరిష్కరిస్తామని మేయర్ సునీల్‌రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుంటే కఠిన చర్యలు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవి

జమ్మికుంట, జూలై 26: వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ వరంగంటి రవి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలో ద్విచక్ర వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్ లేని, ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి వాహనానికి నంబర్‌ప్లేట్ తప్పనిసరిగా బిగించుకోవాలన్నారు. తనిఖీల్లో ఎస్ఐ వివేక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ అయిన అధికారులకు ఆత్మీయ వీడ్కోలు

గన్నేరువరం, జులై 26: మండలంలోని విధులు నిర్వహించి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళుతున్న ఎంపీవో పీవీ నర్సింహారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ యూసుఫ్, కార్యదర్శి సుజాతకు అధికారులు శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల అధికారులు వారిని సన్మానించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి రామానుజన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని, విధి నిర్వహణలో మంచి గుర్తింపును తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాల్లో 'జ్యోతిష్మతి' విద్యార్థుల ప్రతిభ



ఆశ్రిత, రాజ్‌కుమార్

తిమ్మాపూర్, జూలై 26: మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలలో చదివిన ఇద్దరు విద్యార్థులు భారీ ప్యాకేజీలతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. ఎం ఆశ్రిత బెంగళూరులోని ఎన్వీడియా కంపెనీలో 52 లక్షలు, పుల్లా రాజ్‌కుమార్ 16.85 లక్షల రూపాయల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, సెక్రెటరీ, కరస్పాండెంట్ జువ్వాడి సుమిత్‌సాయి, ప్రిన్సిపాల్ కేఎస్ రావు, డీన్ వీకే వైశాలి అభినందించారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర బడ్జెట్



సమావేశంలో మాట్లాడుతున్న దొంత రమేష్

హుజూరాబాద్, జూలై 26: సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేష్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రజామోద బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యమిచ్చిందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 6.7 లక్షల కోట్ల అప్పులు చేసి బడ్జెట్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వని కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్‌పై విమర్శలు చేయడం విడూరంగా ఉందన్నారు. సమావేశంలో సందమల్ల బాబు, బీఆర్‌గౌడ్, దుబాసి బాబు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనం వృథా చేసిన బీఆర్‌ఎస్

● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జూలై 26: ప్రాజెక్టుల పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా చేసిందని, కేటీఆర్ బృందం ప్రాజెక్టుల సందర్శన దొంగనే దొంగా దొంగ అని అన్నట్టు ఉందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి విమర్శించారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎల్‌ఎండి రిజర్వాయర్ సందర్శనలో అధికారులతో మాట్లాడితే 45 శాతం వర్షపాతం తక్కువ నమోదైందని అన్నారని చెప్పిన కేటీఆర్ ఎల్‌ఎండి ప్రాజెక్ట్ నిండలేదని దానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వం అనడం విడ్డూరంగా ఉందని అన్నారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగడానికి కారణమైన కేసీఆర్ ఆదేశిస్తే వచ్చామని చెప్పుకుంటున్న కేటీఆర్ సందర్శించిన అనుభవంతో వాస్తవాలు అసెంబ్లీ వేదికగా చెప్పి తప్పులను ఒప్పుకోవాలని నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ ప్రతిపాదించినట్టు తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్టు కట్టి ఉంటే తక్కువ వ్యయంతో నిర్మాణం అయి గ్రావిటీ ద్వారా నీళ్లు వచ్చేవన్నారు. గత ప్రభుత్వ తప్పుడు నిర్ణయాల వల్ల వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైం దన్నారు. చిత్తశుద్ధితో పనిచేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు చూస్తూ ఊరుకోరని అన్నారు. సమావేశంలో మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజొద్దీన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ నాయక్, అబ్దుల్ రహెమాన్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, పొరండ్ల రమేష్, విద్యాసాగర్, మెతుకు కాంతయ్య తదితరులున్నారు.

రాజకీయ అవగాహనతో ముందుకు సాగాలి

భగత్‌నగర్, జూలై 26: సైద్ధాంతికంగా, రాజకీయ అవగాహనతో కమ్యూనిస్టు శ్రేణులు ముందుకు సాగాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. శుక్రవారం నగరంలోని ఎల్ఐసి ఏజెంట్ల సంఘ భవనంలో జరిగుతున్న రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణ తరగతుల్లో సీపీఐ సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల, జిల్లా కార్యదర్శులు మంద పవన్, గుంటి వేణు, తాండ్ర సదానందం, వెన్న సురేష్‌లతోపాటు ఐదు జిల్లాల కార్యవర్గ సభ్యులు కౌన్సిల్ సభ్యులు శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొండాపూర్ విద్యార్థులకు బస్సు సౌకర్యం

భగత్‌నగర్, జూలై 26: కొత్తపల్లి మండలం నాగులమల్యాల అనుబంధ గ్రామం కొండాపూర్‌కు ఆర్టీసీ ఎండి సజ్జనార్ బస్సు సౌకర్యాన్ని కల్పించారు. కొండాపూర్ విద్యార్థుల కోసం బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ డాక్టర్ కెవి చారి, బీజేపీ నాయకులు రాచకొండ అనిల్, బీజేపీఅధ్యక్షుడు రతన్‌కుమార్ హైదరాబాద్‌లో ఆర్టీసీ ఎండీ కలిసివినతి పత్రం అందించారు. స్పందించిన ఎండి ఆర్టీసీ అధికారులను ఆదేశించగా శుక్రవారం కొండాపూర్ గ్రామానికి బస్సు చేరుకోవడంతో విద్యార్థులు సంతోషించారు.

స్వర్ణకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

కరీంనగర్ టౌన్, జూలై 26: కార్పొరేట్ జ్యూవెల్లరీ షాపులతో వృత్తిని కోల్పోయిన స్వర్ణకారులను ప్రత్యేకంగా స్వర్ణకార ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసి ఆదుకోవాలని రాష్ట్ర స్వర్ణకార సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్తోజు శ్రీనివాస్ అధ్యక్షతన రాష్ట్ర సంఘం సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ఇంజమూరి రాఘవాచారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 272 జీవోను సవరణ చేస్తామని, తమిళనాడు తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీఅమలుకు నోచుకోలేదని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి స్వర్ణకారులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకటస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్తోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు, ఎన్‌సీసీ కేడెట్స్



అల్ఫోర్స్‌లో నివాళులర్పిస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, జూలై 26: కార్గిల్ దివస్‌ను స్మరిస్తూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం, ఎన్‌సీసీ కేడెట్స్ శుక్రవారం వీరచక్ర కెప్టెన్ రఘునందన్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి కార్గిల్ అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, బి మోహన్, ఈసీహెచ్‌ఎస్ ఓఐసీ కర్నల్ నారాయణరెడ్డి, కరీంనగర్ జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు భాస్కర్ మోహన్ పాల్గొన్నారు.

● భగత్‌నగర్: కార్గిల్ పోరాటంలో అమరులైన త్యాగాలు మరువలేనివని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో కార్గిల్ విజయ్‌దివస్ కార్యక్రమంలో పాల్గొని అమరవీరులకు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● సుభాష్‌నగర్: మంకమ్మతోట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు బూర్ల విద్యాసాగర్, కార్యదర్శి అంబటి రవీందర్‌రాజు, కోశాధికారి పాత విశ్వనాథం ఆధ్వర్యంలో ఆర్మీ అధికారులు, సైనికులను సన్మానించారు.

● కరీంనగర్ స్పోర్ట్స్ : జిల్లా కేంద్రంలోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో శుక్రవారం కార్గిల్ విజయ దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడులను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్, రిటైర్డ్ నేవీ అధికారి టీఎస్‌వీ రమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పారమిత విద్యాసంస్థల చైర్మెన్ పాల్గొని కార్గిల్ యుద్ధవీరులకు నివాళులర్పించారు. డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్ రావు, రాకేశ్, ప్రసాద్, వినోద్‌రావు, హన్మంతరావు, గోపికృష్ణ, నాగరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

- వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలోని ఎన్‌సీసీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ ఎన్‌సీసీ బెటాలియన్ హవల్దార్ అమూల్ షిండేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ కెప్టెన్ కె కిరణ్‌జ్యోతి, ఏసీవో బి సంపత్‌కుమార్, డాక్టర్ ఆర్ గోపికృష్ణ, డాక్టర్ ఎండి అలీఖాన్, ఏవో శ్రవన్‌కుమార్ ఉన్నారు.

● సుభాష్‌నగర్: కరీంనగర్ లయన్స్‌క్లబ్స్ ఆధ్వర్యంలో నగరంలోని 9వ బెటాలియన్ కార్యాలయంలో కార్గిల్ విజయ్‌దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో కెప్టెన్ మధుసూదన్‌రెడ్డి, కార్గిల్ యద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొన్న సుబెదార్ ఇందర్‌చంద్, బెటాలియన్ సుబెదార్ మేజర్ సాగర్‌సింగ్ పాల్గొన్నారు.

● భగత్‌నగర్: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా భాగ్యనగర్‌లోని మాంటిస్సోరి పాఠశాలలో రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాజీ సైనికులు కడారి మహేశ్వర్‌రెడ్డి, పొనుగంటి అశోక్‌లను ఘనంగా సత్కరించారు. లయన్స్ క్లబ్ సభ్యులు విద్యాసాగర్‌రెడర్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

●హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ అమరవీరులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి నివాళులర్పించారు. నాయకులు గంగిశెట్టి రాజు, బింగి కరుణాకర్, జెల్ల సుధాకర్, పైళ్ల వెంకట్‌రెడ్డి, మెరుగు రాజిరెడ్డి, తూర్పాటి రాజు, శశిధర్, రమేష్, వాసు తదితరులు ఉన్నారు.

వైభవంగా బోనాలు



జాన్సన్, కోరా పాఠశాల విద్యార్థుల బోనాల ఊరేగింపు

కరీంనగర్‌కల్చరల్, జూలై 26: నగరంలోని జాన్సన్, కోరా పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం బోనాల పండగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు అమ్మవారు, పోతరాజు, పులి వేషధారణలో నృత్యాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్ రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగళ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కరీంనగర్ కల్చరల్: నగరంలోని పారమిత పాఠశాలలో బోనాలు, కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల డైరెక్టర్ ప్రసూనా ప్రసాదరావు, కరీంనగర్ 9 బెటాలియన్ ఆఫీసర్ సుబేదార్ ధర్వ్‌కుమార్, నాయక్ పి వేంకటేశ్వర్‌రావు అతిథులుగా పాల్గొన్నారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి ప్రాథమిక పాఠశాలకు హెచ్‌ఎంను నియమించాలి



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న వైద్యుల రాజిరెడ్డి

హుజూరాబాద్, జూలై 26: గ్రామాల్లో ఉన్న ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి అన్నారు. హుజూరాబాద్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ గత నెలలో ఇచ్చిన పదోన్నతుల్లో ఎస్జీటీలకు నష్టం జరిగిందన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడి పోస్టు కేటాయిస్తూ పదోన్నతులు ఇవ్వాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మూడో తరగతి వరకు అంగన్‌వాడీలో కలపాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలన్నారు. సమావేశంలో ఆవాల నరహరి, రఘుశంకర్‌రెడ్డి, తూముల తిరుపతి, శ్రీనివాస్, సంపత్, సదానందం, రత్నం, చక్రధర్, శ్రీనివాస్, రమేష్, వెంకటస్వామి, సదానందం, వేణు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్సీ మోర్చా నాయకులు

జమ్మికుంట రూరల్, జూలై 26: పట్టణంలోని గాంధీ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి రాజేష్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజ్యాంగాన్ని మారుస్తాడని, రిజర్వేషన్లు తొలగిస్తాడని రేవంత్‌రెడ్డి విషం చిమ్మారన్నారు. దళితులకు కేటాయించిన నిధుల్లో 3,500 కోట్ల రూపాయలు కోత పెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్ ఠాగూర్, అమృతలక్ష్మి అనిత, గండికోట సమ్మన్న, సుశీల, రవిచంద్రరెడ్డి, రామస్వామి, మహేందర్, తిరుపతి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలి

సైదాపూర్, జూలై 26: కేంద్ర ప్రభుత్వ పథకాలను బీజేపీ కార్యకర్తలు గడపగడపకు తీసుకెళ్లాని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌రావు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డి ప్రధాన కార్యదర్శులు గాజుల రమేష్, దంచనాల శ్రీనివాస్, నాయకులు నెల్లి శ్రీనివాస్, కొలిపాక తిరుపతి, గోపాల్‌రెడ్డి, వీరరాగవరెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

'ప్లాస్టిక్ రహిత సమాజంలో మహిళలదే కీలక పాత్ర'

జమ్మికుంట, జూలై 26: ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మూలించడంలో మహిళలదే కీలక పాత్ర అని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయంలో జీవనజ్యోతి పట్టణ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును కమిషనర్ ఆయాజ్‌తో కలిసి చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్టీల్ వస్తువులను వాడాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ రాజిరెడ్డి, ఏడీఎంసీ మల్లీశ్వరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సదానందం, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు రాణి, కోశాధికారి గీత, కార్యదర్శి మౌనిక, సీఎల్ఆర్పీలు జ్యోతి, మంజుల పాల్గొన్నారు.

● మహిళలకు మొక్కలు పంపిణీ

జమ్మికుంట రూరల్: పట్టణ పరిధిలోని 21వ వార్డు మహిళలకు వన మహోత్సవంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు శుక్రవారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని కోరారు.

● పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే దోమలను నియంత్రించి వ్యాధులను అరికట్టవచ్చని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ నీళ్లు నిల్వ ఉండటం ద్వారా దోమలు వృద్ధి చెందుతాయన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వదలాలని, పాత కుండలు, టైర్లు, కూలర్లలో నీళ్లు నిల్వ ఉండకుండా చూడాలన్నారు.

పోషణ్ అభియాన్‌ను సద్వినియోగం చేసుకోవాలి



కొత్తపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

తిమ్మాపూర్, జూలై 26: జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీలో అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన శుక్రవారం సభ పోషణ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గర్భిణులు, మహిళలు ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే అంగన్‌వాడీ టీచర్లను, మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎంలను, ఆశాలను సంప్రదించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డీపీవో రవీందర్, ఎండీపీవో విజయ్ కుమార్, తహసీల్దార్ కనకయ్య, ఎంపీవో కిరణ్‌కుమార్, వైద్యాధికారి ప్రణవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత పాల్గొన్నారు.

బీసీలను నిరాశపరిచిన బడ్జెట్

గణేశ్‌నగర్,జూలై 26:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులలో బీసీ సంక్షేమానికి తక్కువ నిధులు కేటాయించి బీసీలను నిరాశ పరిచాయని బీసీ యువ జన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీసీ సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ బీసీల సంక్షేమానికి రూ.3,300 కోట్లు కేటాయించడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి 9,200 కోట్లు ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం మహిళ అధ్యక్షురాలు గుంటి స్వరూపశ్యాం, యువజన సంఘం నగర అధ్యక్షులు అనుమాస నితిన్ పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అనుకూల బడ్జెట్

గణేశ్‌నగర్,జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు అనుకూలంగా ఉందని, పేదల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఇందిరాచౌక్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు పురం రాజేశం, పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు మడుపు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్టీ సంక్షేమానికి అధిక నిధులు'

గణేశ్‌నగర్,జూలై 26: ఎస్టీ సంక్షేమానికి 17,056 కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోతు శ్రావణ్‌నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాచౌక్‌లో సంబరాలు నిర్వహించారు. సుడా చైర్మన్ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మైనారిటీ సెల్ అధ్యక్షులు తాజుద్దీన్, మహిళ సెల్ అధ్యక్షులు కర్ర సత్యప్రసన్న, కుర్ర పోచయ్య, ప్రేమ్ నాయక్ తదితరులున్నారు.

● సంక్షిప్త సమాచారం..

● భగత్‌నగర్: ఖాళీగా ఉన్న కొత్తపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికను ఆగస్టు 8వ తేదీన నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి ఉత్తర్వులు జారీ చేశారు.

● కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) తెలుగు శాఖ ఆధ్వర్యంలో శాఖాధ్యక్షులు డా. మట్టా సంపత్ కుమార్‌రెడ్డి రచించిన గంగదర్వాజ పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డా. నలిమెల భాస్కర్ ఆవిష్కరించారు. కళాశాల ప్రధానాచార్యులు ప్రొ. టి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

● కరీంనగర్ టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని నూతన ఆవిష్కరణలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని యువత సద్వినియోగం చేసుకొని ఆవిష్కరణపై దృష్టిపెట్టాలని డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ మణిదీప్ సూచించారు. శుక్రవారం నగరంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో ఇంటింట ఇన్నోవేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు లింగయ్య పాల్గొన్నారు.

● కరీంనగర్‌రూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ బొమ్మకల్ ఆధ్వర్యంలో కార్గిల్ దివస్‌ను పురస్కరించుకుని మాజీ సైనికులను బొమ్మకల్ గ్రామంలో ఘనంగా సన్మానించారు. నాయిని లక్ష్మయ్య, చింతల సంపత్ కుమార్, వడ్లూరి సత్యనారాయణరాజులను శాలువాలతో సత్కరించారు.

●కరీంనగర్‌రూరల్:రాష్ట్ర నిధులన్నీ కొండంగల్‌కేనా అని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్‌కుమార్ ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా అభివృద్ధికి ఎన్ని నిధులు తీసుకువచ్చాడో చెప్పాలన్నారు.

● భగత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గోదావరిఖని డిపోలో ఆర్టీసీ అధికారులు శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. ఆర్టీసీ ఈడి వినోద్‌కుమార్ ఆర్ఎం సుచరిత తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లందకుంట: ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కన్న కృష్ణను ఆర్యవైశ్య సంఘం మండల నాయకుడు నగేష్‌గుప్త అభినందించారు.

● వీణవంక: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఎస్ఐ తిరుపతి గంజాయి నివారణపై అవగాహన కల్పించారు.

- మండల కేంద్రం నుంచి లస్మక్కపల్లికి వెళ్లే రహదారిలో ఉన్న ముళ్ల పొదలను కాంగ్రెస్ నాయకుడు మద్దుల ప్రశాంత్ ఎక్స్‌కవేటర్‌తో తొలగించాడు.

● హుజూరాబాద్: సబ్ జైలర్ నాంపల్లి దేవేందర్‌ను జీకే రైతు మిత్ర సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

- హుజూరాబాద్ డిపో మేనేజర్‌గా రవీంద్రనాథ్ శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు.

● శంకరపట్నం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి నాగార్జున అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్తారం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

- శంకరపట్నం మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను అసిస్టెంట్ కలెక్టర్ అజయ్‌యాదవ్ శుక్రవారం పరిశీలించారు.

- మండలంలోని కొత్తగట్టు, గద్దపాకలో డీసీవో రామానుజాచారి మొక్కలు నాటారు.

● హుజూరాబాద్ రూరల్: మండలంలోని కాట్రపల్లికి చెందిన పెరుమాండ్ల శ్రీనివాస్ అనే గీత కార్మికుడు శుక్రవారం తాటి చెట్టు నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు.

● చొప్పదండి: చొప్పదండిలో బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు.

- మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన మాచర్ల మాన్సి అనే బాలికకు చొప్పదండి లయన్స్ క్లబ్ 14వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసింది.

- చొప్పదండిలో గురువారం రాచకొండ మమత అనే వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై రూరల్ ఇన్‌చార్జి ఏసీపీ కాశయ్య విచారణ జరిపారు.

- మండలంలోని రేవెల్లి హెడ్‌రెగ్యులేటర్ వద్ద మైసమ్మ దేవతకు ఎస్ఆర్ఎస్‌పి డీఈ కుమార్ పూజలు చేశారు.

● మానకొండూర్: గంజాయి రహిత మండలంగా తయారు చేసేందుకు మండల ప్రజలు సహకరించాలని స్థానిక సీఐ సదన్‌కుమార్ కోరారు. మానకొండూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంజాయిని విక్రయించినా, సేవించినా వారి సమాచారాన్ని తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

- మానకొండూర్ ఎంపీడీవోగా వరలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

- మండలంలోని పలు పాఠశాలల్లో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు.

● గంగాధర: గర్షకుర్తిలో పవర్ లూం కార్మికుల దీక్షలు కొనసాగుతున్నాయి.

● తిమ్మాపూర్: డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన జితేందర్‌ను హైదారాబాద్‌లో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు.

- వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ సెల్, టీ-హబ్ ఆధ్వర్యంలో మూడో సంవత్సరం విద్యార్థులకు స్టార్టప్స్ ఇన్నోవేషన్స్‌పై అవగాహన కల్పించినట్లు కళాశాల జనరల్ సెక్రెటరీ జి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

- మండల కేంద్రానికి చెందిన చిలువేరి కమలవ్వ మృతి చెందింది. ఆమె కుటుంబసభ్యులకు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలు రామ్ 50 కిలోల బియ్యం అందజేశారు.